పెన్షన్ల దరఖాస్తు గడువు మరో 15రోజులు పొడిగించాలి

దశ, శాలిగౌరారం: తెలంగాణ సామాజిక భద్రతా పెన్షన్ల దరఖాస్తు గడువును మరో 15 రోజులు పొడిగించాలని శాలిగౌరారం సిపిఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం వల్ల వికలాంగులు, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ఈ ఆలస్యాన్ని గమనించి గడువు పెంచాలని, వృద్ధాప్య పెన్షన్లు కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరు లింగయ్య, దాసరి దేవచిత్తం, మక్క బుచ్చిరాములు, నక్కల జ్యోతిబసు, సిరిపంగి ఆంజనేయులు, డెంకెల లింగయ్య, బల్లెం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీలు

దశ, హుజురాబాద్: నగరంలో శనివారం అర్ధరాత్రి పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగర శాంతిభద్రతలను స్వయంగా పర్యవేక్షించారు. ఇందులో భాగంగా రాజీవ్ చౌక్, శనివారం మార్కెట్, తెలంగాణ చౌక్, బైపాస్ రోడ్డులోని దాబాల వద్దకు వెళ్లి నైట్ పెట్రోలింగ్ తీరును పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారా లేదా అని ఆరా తీశారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత కూడా తెరిచి ఉన్న హోటళ్లు, దాబాలు, టీ షాపులు, పాన్ షాపుల యజమానులతో సీపీ స్వయంగా మాట్లాడారు. సమయపాలన పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత విషయంలో రాజీ లేదని, పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

కారుతో ఢీకొట్టి హత్యాయత్నం

దశ, బూర్గంపాడు: వివాహేతర సంబంధం విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తిపై కారుతో హత్యాయత్నానికి దారితీసింది. బూర్గంపాడు మండలం జింకలగూడెం గ్రామంలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ తన స్కార్పియో కారుతో అదే గ్రామానికి చెందిన షేక్ మౌలానాను ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదు అందింది. వివరాల ప్రకారం.. ఓ మహిళతో వివాహేతర సంబంధం విషయంలో షేక్ ఇస్మాయిల్, షేక్ మౌలానా మధ్య కొంతకాలంగా వివాదం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం ఉదయం జింకలగూడెం గ్రామంలో మౌలానాను లక్ష్యంగా చేసుకుని ఇస్మాయిల్ తన స్కార్పియో కారును వేగంగా నడిపి ఢీకొట్టేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై బాధితుడు మౌలానా సోదరుడు షేక్ నాగుల్ మీరా బూర్గంపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, వివాదానికి దారితీసిన కారణాలు, నిందితుడి ఉద్దేశంపై పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, నిందితుడు షేక్ ఇస్మాయిల్పై గతంలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి కొత్తగూడెం జిల్లాలో పలు కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం. తాజా ఘటనకు సంబంధించి కూడా పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

రంగారెడ్డి జిల్లాలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు

దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. పెద్ద అంబర్‌పేటతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పసుమాముల, పరిసర గ్రామాల్లో, అలాగే ఇబ్రహీంపట్నం పరిధిలోని తులేకలాన్ గ్రామంలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల నృత్యాలతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి బోనాలను సమర్పించారు.

పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పిస్తూ కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సుఖసంతోషాలు, గ్రామాల అభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. బోనాల సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పండుగ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో సాయంత్రం వరకు బోనాల ఊరేగింపులు కొనసాగడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను గ్రామస్తులు ఐకమత్యంతో ఘనంగా నిర్వహించారు.

పెళ్లి వేడుకకు వెళ్తూ దంపతుల దుర్మరణం

- *కన్యాదానం చేయాల్సిన దంపతులను బలిగొన్న రోడ్డు ప్రమాదం*

దశ, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఖాదర్గూడెం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బంధువుల ఇంట్లో పెళ్లి వేడుకకు అవసరమైన సామగ్రిని తీసుకెళ్తున్న దంపతులు ప్రమాదంలో మృతి చెందారు. తల్లి లేని యువతి వివాహంలో పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కన్యాదానం చేయాల్సిన వారే మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కరీంనగర్ బొమ్మకల్కు చెందిన భూస శంకరయ్య (50), ఆయన భార్య భూస జమున (45) బంధువుల ఇంట్లో జరగనున్న వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పెళ్లి సామగ్రితో ఆదివారం బైక్పై కరీంనగర్ నుంచి ఖాదర్గూడెం బయలుదేరారు. గ్రామ శివారుకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన మహీంద్రా బొలెరో వాహనం వేగంగా వచ్చి వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో శంకరయ్య, జమున తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.

తార్నాకలో ఏబీఆర్ఎస్ఎం కార్యాలయం ప్రారంభం

దశ ఓయూ: స్థానిక తార్నాకలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) నూతన కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ శ్రీ సునీల్ అంబేద్కర్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ బట్టు సత్యనారాయణ, ఏబీఆర్ఎస్ఎం ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ మహేంద్ర కపూర్ పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎం ఆలిండియా జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ గుంత లక్ష్మణ్, ప్రొఫెసర్ మురళీ మనోహర్‌తో పాటు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, ఏబీవీపీ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏబీఆర్ఎస్ఎం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్. కిషన్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఏలూరు యాదయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

భారతీయ విద్యా పరిశోధన, ఉన్నతికి దోహదం

భారతీయ విద్యా విధానం, పరిశోధన, విద్యా రంగ అభ్యున్నతికి మరింతగా కృషి చేయాలనే ఉద్దేశంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఏబీఆర్ఎస్ఎం కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యాలయ ప్రారంభోత్సవం విజయవంతం కావడానికి కృషి చేసిన డాక్టర్ జగన్, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ సుజాత, డాక్టర్ స్వప్న, భాస్కర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సోమేశ్, కవిత, వివేక్, సుమన్, తిరుపతిరెడ్డి, డాక్టర్ ఉపేంద్ర, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కవిత, డాక్టర్ చిత్తరంజన్, సంపత్, లోకేష్ తదితరులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉన్నత స్థాయి ఉద్యోగులదే హవా..

- *దేవస్థానంలో వాళ్లు చెప్పిందే వేదం...*
- *ఐఎఎస్ క్యాడర్ ఈవోలు ఎందరు వచ్చినా ఐయాం డోంట్ కేర్...*

దశ, యాదగిరిగుట్ట: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో ఉన్నత స్థాయి ఉద్యోగులదే హవా కొనసాగుతోందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కొండ కింది నుంచి కొండపై వరకు వాళ్ళు చెప్పిన విధంగా కిందిస్థాయి ఉద్యోగులు నడుచుకోవాల్సిదే అంటూ...! మరికొందరు ఆలయ ప్రధాన కార్యాలయంలో వారు చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్న వారు కొందరైతే ప్రధానాలయంలో కూడా ఎవరు ఎలా నడుచుకోవాలనేది నిర్ణయించేది మరికొందరు.. ఇలా దేవస్థానాన్ని వాటాలు వేసుకొని వారివారి హవా కొనసాగిస్తూ వారివారి సొంత ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నాలలో బిజీబిజీగా వ్యవహరిస్తూ మరొకవైపు ప్రయివేటు దేవాలయాలకు దాతలను పెంచుతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. కీలక శాఖలో ఉన్నతమైన పదవుల్లో కొనసాగుతూ దేవస్థాన అభివృద్ధికి, భక్తులకు అందించే సేవా భావాన్ని మరిచి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని స్థానిక రాజకీయ నాయకుల ఆరోపణలు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో గతంలో చింతపండు దొంగతనం, డాలర్ల కుంభకోణాలు మరియు గోదాముల్లో ముడిసరుకుల మాయం, టెండర్ల అవకతవకలు వంటి సంఘటనలతో పాటు అర్హత లేని నియామకాలు మరెన్నో విషయాలు బట్టబయలైన్న వాటిపై దృష్టి సారించకుండా అధికారుల వ్యవహారం ఇందుకు నిదర్శనంగా మారాయి. ఉన్నతాధికారుల దృష్టి మళ్లిస్తూ వ్యవహరిస్తూ దేవస్థానంలో ఉన్నతమైన పదవుల్లో కొనసాగుతున్నారనే ఆరోపణల మధ్య వ్యాపార ధోరణిగా కొండపైన కిందిస్థాయి, కాంట్రాక్ట్ సిబ్బందితో దర్శనాల దందా చేసుకునే వారు కొందరైతే, టెండర్ల కమీషన్లులతో వ్యవహరిస్తున్న వారు మరికొందరు.. అదే కోవలో దేవస్థానంలో విరాళాలు సమర్పించే దాతలను ప్రోటోకాల్ పేరిట ఆకర్షించే వారు మరికొందరు.. ఇందులో పైరవీలు చేస్తూ ప్రమోషన్లు పొందుతూ అర్హులైన వారికి అవకాశాలు లేకుండా వ్యవహరిస్తు ఉన్నతమైన పదవుల్లో దర్జాగా వ్యవహరిస్తున్నారనే దేవస్థాన ఉద్యోగుల వాదనలలో వాస్తవాలను వెలికి తియ్యాలని స్థానిక రాజకీయ నాయకుల వాదన.. వారి వాదనలు ఎలావున్నా దేవస్థానంలో ఐఎఎస్ క్యాడర్ కలిగిన లేకపోయినా కార్యనిర్వహణాధికారులు (ఈవోలు) ఎందరు వచ్చినా ఐయాం డోంట్ కేర్... అంటూ చక్రం తిప్పుతూ వారి వారి హవా కొనసాగిస్తున్నారు... అంతే కాకుండా ఉద్యోగ నియామకం నుండి ఒకే సెక్షన్లో ఏండ్ల తరబడి ఉండటం ఒక కారణం అని చెప్పవచ్చు.. ముమ్మాందు దిని ప్రభావం పెరుగుతూ దేవస్థాన ఆదాయాన్నికి భారీ నష్టాన్ని తెచ్చే పరిస్థితి ఉంటుందేమో అనే మాటలో ఏమాత్రం సందేహం లేదనిపిస్తుంది. ఇప్పటికైనా దేవస్థానంలో ఉన్నత స్థాయి ఉద్యోగుల పనితీరుపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి పెట్టి దేవస్థానంపై వస్తున్న ఆరోపణలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానానికి వచ్చే భక్తుల పట్ల సేవాభావంతో అధికారులు విధులు నిర్వర్తించాలని దేవస్థాన సిబ్బందితో పాటు స్థానిక రాజకీయ నాయకులు కోరుతున్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పించాలి

■ మంచిర్యాలలో ఘనంగా ఏఐవైఎఫ్ జిల్లా 3వ మహాసభ

దశ ఓయూ: యువతను కేవలం "యువశక్తి" అంటూ ప్రసంగాల్లో పొగడటం కాకుండా వారికి శాశ్వత ఉపాధి, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్ అధ్యక్షతన జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. మహాసభకు ముందు యువజన ప్రదర్శన నిర్వహించారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు పోరాడతామని నినాదాలు చేస్తూ కార్యకర్తలు ప్రదర్శన చేపట్టారు. అనంతరం మాజీ యువజన నాయకుడు మిట్టపల్లి శ్రీనివాస్ సంఘం జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ కార్యక్రమాలు ప్రకటిస్తూ, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలను తగ్గించడం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను పెంచడం ద్వారా యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడం సరికాదన్నారు. శిక్షణతోపాటు శాశ్వత ఉద్యోగాలు ఎక్కడ కల్పిస్తున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బొగ్గు, విద్యుత్, వ్యవసాయం, పారిశ్రామిక వనరులు పుష్కలంగా ఉన్న మంచిర్యాల జిల్లాలో స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సింగరేణి, జైపూర్ విద్యుత్ కేంద్రం, సిమెంట్, సిరామిక్స్, వ్యవసాయ ఆధారిత రంగాలున్న నేపథ్యంలో కొత్త పరిశ్రమలు, విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. యువతను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా ఉద్యోగ హక్కును ప్రభుత్వ విధానాల్లో కీలక అంశంగా మార్చాలని అన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు.

సైద్ధాంతిక అవగాహన అవసరం

సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ సాధనతోపాటు సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకునే సైద్ధాంతిక అవగాహన అవసరమన్నారు. "శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం" అనే ఏఐవైఎఫ్ సిద్ధాంతాన్ని యువతలో విస్తృతంగా తీసుకెళ్లి ప్రజా సమస్యలపై చైతన్యం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు కరకూరి నరేష్, జిల్లా కార్యదర్శి లింగం రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, ఆఫీస్ బేరర్లు మహేష్, ఆంథోని దినేష్, రామడుగు పంశీ, దుర్గారావు, హచ్చే హరీష్, మొగురం రాకేష్, ఉప్పులేటి తిరుపతి, లవన్‌తోపాటు సుమారు 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

కలశ్ వందన్ అభియాన్‌లో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

దశ, ఓయూ: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ క్రాంతి కిరణ్ అభీష్టం మేరకు సమరసత సంకల్ప అభియాన్‌లో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కలశ్ వందన్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి నాగరాజు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతుల మీదుగా కలశాన్ని ఎస్సీ మోర్చా అర్బన్ జిల్లా అధ్యక్షుడు కటికేల సుధాకర్, ప్రధాన కార్యదర్శి మూర్తి నాగరాజు స్వీకరించారు. కార్యక్రమంలో రామంతాపూర్ బీజేపీ సీనియర్ నాయకుడు దుర్గేష్‌తో పాటు ఎస్సీ మోర్చా అర్బన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రణవ్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్, బీజేపీ నేతలు

దశ, హుజురాబాద్: కాంగ్రెస్ప్రభుత్వంఅందిస్తున్నసంక్షేమపథకాలకుఆకర్షితులై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. ఒకవైపు సంక్షేమ పథకాలు,మరొకవైపు అభివృద్ధి రెండు సమపాళ్ళలో ప్రభుత్వం అందిస్తుందని,నియోజవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ప్రజలకు ఇంచార్జి గా ప్రణవ్ బలంగా తీసుకువెళ్తున్నారని వారి ఆధ్వర్యంలో పని చేయడానికి ముందుకు వచ్చామని తెలిపారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు చేరవేస్తామని,మరిన్ని నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ నియోజకవర్గానికి అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సదానందం,మండల అధ్యక్షుడు పరశురామ రావు,గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్,యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్,డివైసి సెక్రటరీ సజ్జు,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాగర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్,వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

❖ ఉప్పల శ్రీనివాస్ గుప్తా

దశ, హైదరాబాద్: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేయడం ద్వారా అలాంటి వారి ప్రాణాలను కాపాడవచ్చని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు.నిజాంపేట్ శ్రీనివాస్‌నగర్ కాలనీ పార్కులోని వినాయక మండపంలో ఆదివారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆదిత్య బ్లడ్ సెంటర్, హోలిస్టిక్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందితే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని, అర్హత ఉన్నప్పుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో సుమారు 130 మంది రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు.ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడేలా ఉచిత వైద్య శిబిరాలతో పాటు రక్తదాన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ గుప్తా తెలిపారు.

రుణాల మంజూరులో అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్

దశ, హైదరాబాద్: ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరులో తమ సామాజిక వర్గానికి అన్యాయం జరిగితే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్ అన్నారు.మండల కేంద్రంలోని ఆర్అండ్బీ అతిథి గృహం ఆవరణలో ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా యాసం రమేష్ మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం గతంలోనే దరఖాస్తులు స్వీకరించడంతో పాటు, అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు.మాదిగ సామాజిక వర్గానికి చెందిన అర్హులకు రుణాలు అందకుండా, ఎస్సీ కేటగిరీలోని ఇతరులకు రుణాలు మంజూరు చేసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అర్హత ఆధారంగా పారదర్శకంగా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన అర్హులకు రుణాలు మంజూరు చేయకుండా అన్యాయం చేస్తే మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని రమేష్ హెచ్చరించారు. తమ హక్కుల సాధన కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

SIR–2పై బీజేపీ కార్యాచరణ సమావేశం

దశ ఓయూ: ఓటర్ల సమగ్ర సవరణ (SIR) రెండో దశకు సంబంధించి ఉప్పల్ నియోజకవర్గ కార్యాచరణ సమావేశాన్ని బీజేపీ BLA-1 పోతగాని గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో రామంతాపూర్ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీఎస్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ క్రమశిక్షణకు ప్రాధాన్యమిచ్చే పార్టీ అని, కార్యకర్తలు నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తున్నారని అన్నారు.

పార్టీని నమ్ముకుని కష్టపడే నాయకులు, కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన నాయకులకు సీనియారిటీ ప్రాతిపదికన ప్రాధాన్యం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలు, కార్యాచరణకు లోబడి ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని సూచించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

SIR ప్రక్రియలో ఉప్పల్ నియోజకవర్గం ముందంజలో ఉందని జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, SIR జిల్లా కన్వీనర్ నందనం దివాకర్ తెలిపారు. SIR తొలి దశలో చురుగ్గా పనిచేసిన BLA-2లు, బూత్ కోఆర్డినేటర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలను అభినందించారు. ఇదే ఉత్సాహంతో SIR రెండో దశను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. SIR ఒక కీలకమైన కార్యక్రమమని, దీనిని విపక్షాలు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని ప్రభాకర్ అన్నారు. రెండో దశలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అధికారుల నుంచి నోటీసులు అందిన ఓటర్లు, అందులో కోరిన పత్రాలను సమర్పించాలని తెలిపారు. SIRకు సంబంధించి సందేహాలు లేదా సహాయం అవసరమైతే స్థానిక బీజేపీ కార్యకర్తలను సంప్రదించాలని, వారు ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్, SIR జిల్లా కన్వీనర్ నందనం దివాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌరిగే కృష్ణ, మాజీ కార్పొరేటర్ శ్రీవాణితో పాటు బూత్ కోఆర్డినేటర్లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, BLA-2లు, ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్నవ్యక్తి అరెస్ట్

❖ 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

దశ, జగిత్యాల : గంజాయి సరఫరా చేస్తూ అమ్ముతున్నవ్యక్తిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు . జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, మెట్ పల్లి డీఎస్పీ రాములు సూచనలతో, సీఐ బి. సురేష్ బాబు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ కుమార్ , పోలీసు సిబ్బంది ఇబ్రహీంపట్నం బస్టాండ్ వద్ద పక్కా సమాచారం తో మెట్పల్లి నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చిన బీహార్ రాష్ట్రానికి చెందిన సాగర్ కుమార్ (19) ను అదుపులోకి తీసుకున్నారు.కొద్ది రోజులుగా గంజాయి సరఫరా పై నిఘా పెట్టి పక్కా ప్రణాళిక తో అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారణలో అతను బీహార్ నుంచి గంజాయి తీసుకొచ్చి మెట్పల్లి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

తాజాగా తీసుకొచ్చిన గంజాయిలో మిగిలిన 300 గ్రాముల ఎండు గంజాయిని ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలియజేశారు. నిందితుడి వద్ద నుంచి 300 గ్రాముల ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ ఆపరేషన్లో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న ఎస్సై జి. నవీన్ కుమార్, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, ప్రశాంత్ చైతన్య, మహేందర్లను మెట్పల్లి సీఐ బి.సురేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా, విక్రయం లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి

❖ మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి డిమాండ్

దశ, హుజురాబాద్: హుజురాబాద్ గ్రామీణ ప్రాంత సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాసేవలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల నివేశన స్థలాలపై అడ్డంకులు సృష్టించడం సరికాదని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి స్పష్టం చేశారు.హుజురాబాద్‌లో గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షకు ముందు జర్నలిస్టులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీతో పాటు స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ...మూడేళ్ల క్రితం నిబంధనల ప్రకారం ప్రభుత్వం జర్నలిస్టులకు స్థలాలు కేటాయించిందని గుర్తుచేశారు. పట్టాలు పొందిన జర్నలిస్టులు ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు వెచ్చించి చిన్నపాటి గదులు నిర్మించుకుని, విద్యుత్ సౌకర్యం కూడా పొందారని తెలిపారు. వారు నివాసయోగ్యంగా మలుచుకుంటున్న సమయంలో కావాలని కేసు వేసి ఇబ్బందులకు గురిచేయడం తీవ్ర అన్యాయమన్నారు.

ప్రభుత్వం, జిల్లా మంత్రి చొరవ చూపాలి...

పార్టీ కార్యకర్తలు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లా మంత్రిపై ఉందని ఆయన పేర్కొన్నారు. బాధ్యులైన నాయకులతో పాటు జర్నలిస్టులను చర్చలకు పిలిచి వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దాటవేత ధోరణి వీడి, జర్నలిస్టులకు స్థలాలను అప్పగించడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సమస్య కొలిక్కి వచ్చేంత వరకు జర్నలిస్టుల వెన్నంటే ఉంటానని స్పష్టం చేశారు. కాగా, ఈ దీక్షలకు పీవీ సేవా సమితి సైతం మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పీవీ సేవా సమితి నాయకులు బి. మనోజ్ కుమార్, తూము వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు అకినపల్లి శిరీష తదితరులతో పాటు జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.